



(పదవ భాగం)

అతని చేతిలో వున్న ఆయుధాన్ని నా గుండెలకు గురి పెట్టి, దగ్గరగా వచ్చి నా పాంటును, చొక్కా తడిమి చూశాడు. చొక్కా తొలగించి, నా శరీరం కేసి చూశాడు. అతనికేదో విచిత్ర జంతువును చూచినట్లుంది.

నా గుండెలు పైనుండి శూలాన్ని తీసేశాడు తన పరీక్షలు పూర్తయ్యాక. నేను క్రిందపడ్డ పళ్ళు తీసుకొందామని వంగాను. వీపు పైన బలంగా దెబ్బ పడింది. అది అతని చేతిలో వున్న ఆయుధం తాలూకు దెబ్బని అర్థమయింది. మెదడులో మెరుపులు మెరిశాయి. కుప్పలా కూలిపోయాను.

మళ్ళీ కళ్ళు తెరిచి చూసేసరికి ఆ పండ్ల చెట్టుకు కట్టబడి వున్నాను. నా ముందు కుక్కలు నిలుచుని వున్నాయి. నెల్లా ఏమయిందోనన్న భయంతో మౌనంగా ఎక్కడైనా వుండి నన్ను గమనిస్తుందేమో ఆమె అన్న అనుమానం కలిగింది.

ఎవరో మనుషులు దూరంగా నడచి వస్తున్న అలికిడి అయింది. తలెత్తి చూశాను. నన్ను కొట్టిన మనిషి, మరో అరడజను మందిని వెంటబెట్టుకొని వచ్చారు. అంతా అతని లాగే వున్నారు.

వాళ్ళలో ఒకతను డొల్లాను త్రాళ్ళతో కట్టి, ఆ త్రాడు పట్టుకొని వున్నాడు.

ఆ వచ్చిన మనుషులంతా నన్ను తేరిపార చూడసాగారు. ఇద్దరు ముగ్గురు వచ్చి వొళ్ళంతా తడిమివెళ్ళారు. వాళ్ళల్లో వాళ్ళే చాలాసేపు చర్చించుకోవడం నేను గమనించాను. ఆ తర్వాత ఏదో నిర్ణయానికి వచ్చినట్లున్నారు. నా కట్లువిప్పి, చేతులకు కాళ్ళకు కలిపి ఒక త్రాడు కట్టారు.

ముందు ముగ్గురూ, వెనుక ముగ్గురూ చేరి మమ్మల్ని కదలమన్నారు. వాళ్ళు చెప్పినట్లే చేశాను.

మాతోపాటు ఒక డజను కుక్కలున్నాయి. అవీ మనుషులంత ఎత్తున్నాయి. మనుషుల్లాగే నడవసాగాయి.

వాళ్ళతో నడుస్తూనే చుట్టూవున్న పరిసరాల్ని గమనించసాగాను. అక్కడక్కడా చిన్నచిన్న తోటలున్నాయి.

అక్కడ నాకు కనుపించిన మనుషులంతా ఎత్తులోనూ, లావులోనూ, ఆకార వికారాల్లోనూ ఒకేరకంగా వున్నారు. ఒక్కరికీ వొంటిపైన బట్టలులేవు. మర్మాంగాల్ని కాపాడుకునేందుకు అదేదో చెట్టుపట్టాలు వాడుతున్నట్లు తోచింది. ప్రతిమనిషి చేతులోనూ ఒకేరకం ఆయుధం వుంది.

మమ్మల్ని ఒక మైలు దూరం పైగానే నడిపించుకు పోయారు.

ఒక పెద్ద గ్రామం లాంటిది వచ్చింది. చిన్నచిన్న

మట్టి ఇళ్ళలాంటి గుడిసెలు ఐదారువందలు పైనే కనుపించాయి. ప్రతి ఇంటిపైనా కప్పుకు ఉపయోగించిన ఆకులు ఒకేరకంగా వున్నాయి.

గుడిసెల మధ్యనుండి మమ్మల్ని కొంతదూరం నడిపించారు.

ఎక్కడికి తీసుకుపోతున్నారో, ఎందుకు తీసుకుపోతున్నారో, ఏం చెయ్యదల్చుకొన్నారో నాకు అంతుబట్టలేదు. డెల్లాకు వాళ్ళ ఆకారాలు సగం భయం పుట్టించినట్లున్నాయి' మిగిలిన సగం వాళ్ళ చేతుల్లో వున్న ఆయుధాలు చూశాక కలిగివుండా లనుకున్నాను. మాటా పలుకూ లేకుండా అడుగులో అడుగేసుకుంటూ వాళ్ళమధ్య నడవసాగింది.

అంతకుముందు మేము చూచిన గుడిసెలకన్నా కాస్త పెద్దదిగా వున్న గుడిసె ముందున్న ఖాళీజాగాలో మమ్మల్ని నిలబెట్టి, ఒకతను లోనికి వెళ్ళాడు. వెళ్ళిన వెంటనే తిరిగి వెలుపలికి వచ్చాడు. అతని వెనుకనే బాగా లావుగా పొట్టిగావున్న వ్యక్తి వెలుపలికొచ్చాడు. అతని మెళ్ళో ఎముకలతో కూర్చిన దండొకటి వ్రేలాడుతోంది. దండ మధ్యగా లాకెట్‌లో పుర్రె నొకదాన్ని బిగించి వుంచారు.

ఎడంచేతిలో లావుపాటి పొడవైన పెద్ద జంతువు ఎముకొకటి వుంది. కుడిచేతిలో మట్టితో చేసిన ముంతొకటి వుంది. దాంట్లోనుండి ఏదో పానీయం ఎత్తి పోసుకొన్నాడు. అతన్ని చూడగానే నా చుట్టూవున్న జనమంతా తలలు వంచుకుని నిలుచున్నారు. నన్ను పట్టుకొన్న వ్యక్తి ఆ మనిషితో నా కర్థంకాని భాషలో ఏమేమో చెప్పసాగాడు.

అతను చెప్పేదంతా నా గురించే అయివుండాలని ఊహించాను.

అంతా విన్నాక అతను నా ముందుకొచ్చి ఎడంచేతిలో వున్న ఎముకతో తలపైన బలమైన దెబ్బ కొట్టాడు. నాకు దిమ్మ తిరిగిపోయింది. డెల్లాను కూడా కొట్టడం మసకగా కనుపించింది. ఆమె "అమ్మో!" అని అరచి క్రింద కుప్పలా కూలిపోయింది. అతని పైకి దుముకుదా మనిపించింది. కానీ వొంట్లో వీసమెత్తు కూడా సత్తువలేదు. చూస్తూ క్రింద పడకుండా, చైతన్యం పోకుండా, నిలదొక్కుకుని నిలుచున్నాను.

ఆ మూక కతనే నాయకు డయివుండా లనిపించింది నాకు.

అతను ఎముకతో మట్టి ముంతను బలంగా కొట్టాడు. తుత్తునియలయి పోయిందది. దాంట్లోంచి పెద్ద మంటలు లేచాయి. వాటి సెగ నా మొఖానికి వేడిగా తగిలింది. ఆ వేడికి మాడిపోకుండా తల ప్రక్కకు త్రిప్పుకున్నాను.

అతను మళ్ళీ ఏంచేశాడో ఏమో నేను గమనించలేదు కానీ మంటలు మాత్రం మాయమయినాయి.

ప్రక్కనున్న మనుషులతో అరుస్తూ ఏమో చెప్పాడు. ఆ తర్వాత అతను తన గుడిసెలోకి వెళ్ళిపోయాడు. మమ్మల్నిద్దరినీ గుడిసెలకు దూరంగా లాక్కుపోయారు. అక్కడ త్రవ్వి పెట్టివున్న పెద్ద గొయ్యిలోకి బలంగా త్రోశారు. ఇద్దరం ఒకరి మీద ఒకరం పడిపోయాం. గొయ్యి చుట్టూ పైభాగాన కుక్కలు తిరగసాయి.

గోతిని గమనించి చూశాను. నాలుగు నిలువుల లోతున వుంది. పైకి ఎక్కేందుకు ఏ విధమైన ఆధారమూ కనుపించలేదు.

డెల్లా కళ్ళు తెరచింది.

"ఏమయిందిః?" అడిగింది.

చూసింది చూసినట్లు చెప్పాను.

నాకు దగ్గరలో పకపక నవ్వులు, సకిలింపులు, పిచ్చి కేకలు, వినిపించాయి. ఎవరన్నా ఉన్నారేమోనని చూశాను. కానీ ఎవ్వరూ కనుపించలేదు. ఆ శబ్దాలు ఎక్కడినించి వస్తున్నాయని ఆలకించి వింటూ కళ్ళు చిట్లించి చూడసాగాను. నాకెవ్వరూ కనుపించలేదు. శబ్దాలు మాత్రం ఒక నిర్ణీతమైన విరామంతో వస్తూనే వున్నాయి.

డెల్లా వొణికిపోతూంది. ఆమెకు ధైర్యం చెప్పాలని వుంది. కానీ నాకే ధైర్యం సన్నగిల్లి పోసాగింది. ఆ అరుపులు ఏ దయ్యాలవో అయివుంటాయన్న అనుమానం కలిగింది. ఇండియాలో దయ్యాలున్నాయని నా స్నేహితులు చెప్తూంటే విని నవ్వేవాణ్ణి. చాలామంది వాళ్ళ అనుభవాలు చెప్పినా నాకు నమ్మకం చిక్కలేదు. నన్ను ఇంతదాకా ఏ దయ్యమూ పట్టలేదు.

"ఈ అరుపులు కేకలు ఏమిటవి?" అడిగింది డెల్లా.

"నాకూ అర్థంకావటంలేదు. ఏవైనా స్పిరిట్స్ అంటే దెయ్యాలగోలలావుంది" అన్నాను.

దయ్యం పేరు వినగానే డెల్లా కళ్ళల్లో భయం కొట్టొచ్చినట్లు కనుపించింది.

"అవి మనల్ని పీక్కుతింటాయా?"

"అలాగని నాకెవ్వరూ చెప్పలేదు. ఈ దీవిలో మనుషులకు మంత్రశక్తులు వున్నట్లున్నాయి. వాళ్ళ నాయకుడు చేతిలోవున్న ఎముకతో మంటలు సృష్టించాడు, ఆర్పివేశాడు" అన్నాను.

"మనల్ని ఎందుకిలా బంధించినట్లు?" అడిగింది డెల్లా.

"ఏమో? వాళ్ళ భాష మనకు అర్థంకావడంలేదు" అన్నాను.

ఆ రోజంతా ఆ గుంటలోనే పడివున్నాం. మాకూ ఆకలిదప్పికలుంటాయన్న జ్ఞానం వాళ్ళకు లేనట్లుంది. తినేందుకు ఏమీ ఇవ్వలేదు. చీకటి పడింది. పైనుండి మంచు దట్టంగా కురవడం మొదలెట్టింది. చలితో వొణికి పోయాం ఇద్దరం. కడుపులో ఏమీ లేనందువల్ల, కన్ను మూసినా నిద్ర రాలేదు. దయ్యాలు గోల చేస్తూ నేవున్నాయి. కానీ ఒక్కటీ నా పైకి రాలేదు. డెల్లా కళ్ళల్లో వొత్తు లేసుకుని కూర్చుంది.

"కాసేపు పడుకోరాదూ?" అన్నాను.

"భయంగావుంది. నిద్రపోతే ఆ దయ్యాలు పైనబడి పీక్కుతింటాయేమో?" అంది డెల్లా.

"అవి ఆపని చేసేందుకు మనం మేలుకున్నా పెద్దఅడ్డం కాదు!" అన్నాను.

"ఏమిటో మన ప్రయాణం మూడడుగులు ముందుకు పోతే ఆరడుగులు వెనక్కు వస్తున్నాం. అసలు ప్రాణా లతో మనం మన దేశాలకు చేరుతామా?"

"నిరాశ, నిస్పృహలు మనల్ని ప్రయత్న విముఖుల్ని చేస్తాయి. చావుకన్నా పెద్దశిక్ష, ఘోరమైన బాధ మనకులేదు. అదెటూ తప్పదన్నప్పుడు బ్రతికేందుకు అన్ని రకాలా పోరాడాలి. గెలిస్తే మంచిదే! కాని ఓడిపోతే చేసేదేమీ లేదు" అన్నాను.

"ఈ గుంటలోనుండి బైటపడేమార్గం ఆలోచించవూ?"

"లాభంలేదు. మనం ఏదోలాగ పైకెక్కినా తప్పించు కోలేం. దాదాపు ఒక డజను వేటకుక్కలు కాపలా కాస్తున్నాయి. వాటికి తోడు కొంతమంది మనుషులు కూడా వుండివుంటారు. వాళ్ళ దగ్గరున్న ఆయుధాలు చూశావుగా. ఈ మనుషులు ఆఫ్రికన్లని నాకు అనుమా

నంగావుంది. నాగరికత, చదువూ, విజ్ఞానం వీళ్ళదాక రానేలేదు. మూరత్వం ఎక్కువ. మనం శత్రువులం కాదన్న నమ్మకం వాళ్ళకు కలగాలి. దానికి మన ప్రవర్తన గీటురాయిగా వుంటుంది. ఏ పరిస్థితుల్లోనూ వాళ్ళకు ఎదురు తిరగకూడదు. వాళ్ళు చెప్పినట్లు నడచుకోవడం వల్ల కొంత ప్రయోజనం వుంటుందని నాకు అనిపిస్తుంది. ఏమంటావ్?" అడిగాను డెల్లాను.

"ఏమో? నా మెదడు మొద్దుబారిపోయింది" అంది.

అలాగే ఏదేవో చెప్పుకుంటూ గడిపాం తెల్లారేదాకా. బాగా ఎండ వచ్చింది. గుంట పైభాగాన పెద్దపెద్దగా కేకలువేస్తూ చేరారు కొంతమంది జనం. తలెత్తి పైకి చూశాను. వాళ్ళ నాయకుడు ఎముకను గాలిలో అటూ ఇటూ ఊపుతూ పెద్దగా మంటల్లాంటివేవో కల్పించాడు. ఆ హడావుడి ఏమిటో, ఎందుకో నాకు అర్థంకాలేదు.

ఆ గుంటలో వున్నట్టుండి అంచులనుండి నీళ్ళురావడం మొదలెట్టాయి. చూస్తూండగానే మోకాలులోతుదాకా వచ్చేశాయి. డెల్లా భయంగా చూస్తూవచ్చి నాప్రక్కనే నిలుచుంది.

"ఆ నాయకుడేదో మంత్రం వేశాడు. నీళ్ళొస్తున్నాయి" అన్నాను.

"చిత్రంగావుందే!" అంది.

"మంత్రశక్తులు కొంతమందికి ఇక్కడేకాదు మనదేశంలోనూ వున్నాయి. అయితే పిల్లదగ్గరేవో పెద్ద మహత్తు వున్నట్లుంది" అన్నాను.

భూమిని బ్రద్దలు కొట్టుకుని పైకివచ్చే నీటిబుగల్లాంటివి చుట్టూ ఏర్పడ్డట్టున్నాయి. నిముషాల్లో నిండిపోతూంది ఆ గుంట. అక్కడ నీటిమట్టం పెరగడంతోపాటు మేమూ

పైకి రాసాగాం. ఒక గంటలో గుంటంతా నీటితో నిండి పోయింది. మేము పైకి వచ్చేశాం. ఈదుకుంటూ ఒడ్డు చేరాం.

తలెత్తి చూశాను. ఎత్తైన పెద్దబండపైన కూర్చొని వున్నాడు. అతని మెళ్లో ఎముకలదండ వ్రేలాడుతోంది. అతని వెనుక ఆయుధాలు ధరించిన అతని అనుచరులు ఆరేడువందలమంది వరుసగా లైన్‌లలో నిలబడివున్నారు. ప్రతి ఒక్కరి కాళ్లముందూ ఒక పెద్ద కుక్క వుంది. నాయకుడి కాళ్ళదగ్గర నాలుగైదు కుక్కలు చుట్టు ముడుచుకొని పడుకున్నాయి. నాయకుడి కుడికాలు ఒకకుక్క పైనవుంది నిజానికి.

మమ్మల్ని దగ్గరగా రమ్మన్నట్టు సైగచేశాడు నాయకుడు.

నేనూ డెల్లా వెళ్ళి అతనిముందు గజందూరంలో నిలబడ్డాం.

అప్పుడే గమనించాను. అతను నాలో సగం ఎత్తు వుంటాడని. మాముందు అక్కడున్న జనమంతా మరుగుజ్జుల్లాగున్నారు.

అతనేదో చేతుల్తో సైగలుచేసి అడిగాడు. నాకు అర్థం కాలేదు. డెల్లా కేమైనా అర్థమైందోనని ఆమెకేసి చూశాను. ఆమెకూడా పెదాలు విరిచింది తెలీదన్నట్లు.

మాకు విపరీతంగా ఆకలవుతుందనీ, దాహంగావుందనీ, కడుపుపైన తట్టి చూపిస్తూ నోరు వెళ్ళబెట్టి చేత్తో సైగ చేసి చెప్పాను.

అది అతనికి అర్థమైనట్లుంది. పెద్దగా అరచాడు. ఒకతను వచ్చి ముందు నిలబడ్డాడు. అతనికేదో చెప్పిపంపాడు.

రెండు నిముషాల్లో తెల్లగా బియ్యంలా వున్నవి తెచ్చి మా దోసిళ్ళలోపోసి తినమన్నాడు.

• వాట్ని తదేకంగా చూశాను. వెదురుబియ్యమై వుండాలనిపించింది. అవి మెల్లగా తినసాగాం. మా పళ్ళకున్న సత్తువ వాట్ని నమిలేందుకు చాలదనిపించినా తంటాలు పడ్డాం నమిలేందుకు. ఆ బియ్యం పూర్తిగా తినేందుకు పదిహేను నిముషాలపైనే పట్టింది.

ఆ తర్వాత మట్టి ముంతలతో ఏదో తెచ్చి ఇచ్చారు. వాసన చూశాను. త్రాగేవేనని తెలుసుకొనేందుకు ఎక్కువ టైం అవసరం లేకపోయింది. ఇద్దరం కడుపునిండా త్రాగి ముంతలు మెల్లగా వొంగి క్రింద పెట్టాడు.

మాకు ఆ ముంతలిచ్చిన అతను వచ్చి వాట్ని అందుకున్నాడు. అక్కడున్నదంతా మగవాళ్ళే. ఆడపురుగు నాకు కనుపించలేదు.

ఇద్దరు మనుషులు వచ్చి మా బట్టలు విప్పి నగ్నంగా తయారుచేశారు. ఆ తర్వాత వాళ్ళు కట్టుకునే నారబట్టలు తెచ్చి మర్మావయవాలు మాత్రం కప్పేట్లు కట్టుకోమని సైగ చేశారు. ఇద్దరం వాళ్ళు చెప్పినట్లు చేశాం.

నాయకుడు ఒకతన్ని పిలిచి ఏదో చెప్పాడు. అతను విని వంగి సలాం చేశాడు. డెల్లాను చెయ్యి పట్టుకుని లాక్కుపోయాడు. ఒక కుక్కపైన ఎక్కించాడు. అతను కూడా మరో కుక్కపైన ఎక్కాడు. రెండు కుక్కలూ రేసుగుర్రాల్లా పరుగెత్తిపోయాయి. ఆమెను ఎక్కడకు తీసుకుపోతున్నారో, ఎందుకు తీసుకుపోతున్నారో నాకు తెలియలేదు. అడుగుదామనుకుంటే వాళ్ళ భాష తెలీదు.

నా చుట్టూ పదిమంది జనం చేరారు.

రాతిగుండొకటి తెచ్చారు. దానికి రంధ్రం చేసి దాన్లోంచి తాడులాంటి దానితో కట్టివేశారు ఒకవేపు. రెండో చివర తెచ్చి నా నడుంచుట్టూ కట్టారు. నే నా గుండుకేసి చూశాను.

దాని బరువు సుమారు ఒక క్వింటాల్ వుండి వుంటుం దనుకున్నాను.

నా ముందో పదిమంది నిలబడ్డారు. వెనుక కూడా అలాగే నిలబడ్డారు. ఒకతను చేతిలోని ఆయుధంతో వీపు పైన గుచ్చాడు ముందుకు పొమ్మన్నట్లు సైగ చేశాడు ఒకతను.

పళ్ళు బిగబట్టి, బలమంతా వుపయోగించి, మూలుగుతూ శరీరాన్ని కదిపాను. బండ ఒక అంగుళం జరిగింది.

అదిచూసి అందరూ వెఱ్ఱి కేకలు వేశారు. వాళ్ళ నాయకుడు కూడా కేకలు పెట్టాడు. చూస్తూ నిలబడ్డాను ముందుకు కదల్లేదు.

ఒక మనిషి వచ్చి నా నడుంకున్న కట్టు విప్పి, తన నడుంకు కట్టుకున్నాడు. ఆకాశం దద్దరిల్లేలా అందరూ ఒక్కరిగా కేకలు పెట్టారు. అతను ఒక్క వుదుటున పరుగెత్తాడు. అతని వెంట పూలచెండులా పరుగెత్తింది రాతిబండ. ఫర్లాంగుదూరం ముందుకు పరుగెత్తి, సులభం గానే వెనక్కి తిరిగి మళ్ళా ఆ రాతిగుండును లాక్కొ చ్చాడు నా ముందుకు.

నేను దాన్ని లాగేందుకు తన్నుకులాడటం చూసి హేళనగా నవ్వటానికే వాళ్ళంతకుముందు అల్లరిచేశారని అప్పుడు అర్థమయింది. అతను నడుంకున్న కట్టు విప్పు కున్నాడు.

అతన్ని చూసి నవ్వాను నేను. నాకు మళ్ళా కట్టమని అడిగాను, ఏమైనా దాన్ని లాక్కుపోయి నాకూ చేతనవు నని చూపించి వాళ్ళ నోళ్ళు మూయిద్దామన్న ఆరాటంతో. అందరూ నా సైగలుచూసి మళ్ళా పెద్దగా అరచారు. నాయకుడు లేచి వచ్చి నా ముందు నిలబడ్డాడు. మళ్ళా ఆ రాతిబండను నా నడుంకు కట్టించుకున్నాను.

ముందుకు పోనిమ్మన్నట్లు సైగ చేశారు. ఈమారు వంట్లో వున్న శక్తినంతా నడుంలోకి కూడకట్టి, బలంగా గుంజాను. రాయి కదలింది. రెండుగజాలు ముందుకుపోయాను. అంతే తట్టుకోలేక వెనక్కి వెల్లకింతలా పడ్డాను. చల్లగా తగిలింది. తీసి చూసుకున్నాను. చెయ్యంతా ఎర్రగా వుంది. బలంగానే దెబ్బ తగిలివుండాలనిపించింది.

నా నడుంకున్న కట్లు విప్పేశారు చకచక. నన్నెత్తుకున్నారు నలుగురు మనుష్యులు. పగుగెత్తినట్లు నడవసాగారు. నాయకుడి గుడిసెముందు వెల్లకింతలా పడుకోబెట్టారు. నాకు స్పృహ వుంది. అంతా అర్థమవుతూనే వుంది.

లోపల్నుండి పెద్దపెద్ద మట్టి కూజాలాంటివి తెచ్చిపెట్టారు. ఆ నాయకుడు దగ్గరుండి చెపుతున్నాడు. ఒకతను రకరకాల పసరులుతీసి నా గాయానికి పూస్తున్నాడు. ఆకుతో తుడుస్తున్నాడు. మళ్ళీ ఏదో పసరు పూస్తున్నారు. అలా అరగంట పైనే చేశారు. చివరకు తలకు పెద్ద వెడల్పాటి ఆకు కట్టారు. మళ్ళీ నన్నెత్తుకొని పోయారు. ఒక చిన్న పూరిగుడిసెలో దిగ విడిచారు.

తల బాగా దిమ్మెక్కిపోయి వుంది. రాత్రంతా నిద్దర లేకపోవడంవల్ల నీరసంగా వుంది. అటూ ఇటూ కదలకుండా అలాగే పడుకున్నాను. వెంటనే నిద్ర పట్టింది. అలా ఎంతసేపు నిద్రపోయానో నాకే తెలీదు.

మళ్ళీ కళ్ళు తెరిచేసరికి తలలో దిమ్ము తగ్గిపోయింది. వొంట్లో ఉత్సాహంగా కూడా వుంది. లేచి కూర్చున్నాను. ఆ గుడిసెలో ఏమీ లేవు. వంగి కూర్చుని, దానికున్న ఒకేఒక ద్వారం ముందుకొచ్చి చూశాను. ఇద్దరు ఆఫ్రికన్లు కాపలాకాస్తూ కనుపించారు. వాళ్ళతోపాటు వాళ్ళ కుక్కలుకూడా వున్నాయి.

నాకు డెల్లా ఏమయిందోనన్న ఖంగారు ఎక్కువైంది. ఆమెను ఎక్కడకు తీసుకుని వెళ్ళివుంటారని ఊహించ సాగాను. వీళ్ళవల్ల ఆమెకేమన్నా ప్రమాదం జరిగి వుంటుందాని భయం పుట్టుకొచ్చింది. ఆమె క్షేమంగా వుందని తెలుసుకోవాలనిపించింది. అందుకు మార్గం తోచ లేదు.

నా గుడిసెముందు కాపలాకాచే ఇద్దర్నీ తన్ని వెళ్ళి వెతుకుదామా అన్న ఊహ వచ్చింది. వాళ్ళ బలం అంతకు ముందే కళ్ళారా చూశాను. వాళ్ళతో తలపడటం ప్రాణాలకు ఆపద కొని తెచ్చుకోవడమే ననిపించింది. ఆ ప్రయత్నం ప్రయోజన రహితంగానూ, ప్రమాద భరితం గానూ వుండటంతో విరమించుకున్నాను.

వాళ్ళ భాష న్నా అర్థమయితే బాగుండు ననిపించింది. అడిగి తెలుసుకొనే అవకాశమన్నా వుండేది. అదీ ప్రస్తుతం శూన్యం కావటంతో ఏం చేసేందుకూ తోచ లేదు.

ఒక పెగ్గు విస్కీ త్రాగి, రెండు సిగరెట్లు కాలిస్తే మెదడుకు పదును వస్తుంది. కానీ అవి ఈ దీవిలో దొరికే అవకాశం లేదు.

జీవితమంతా ఈ రాతిమనుషుల మధ్య గడిపివేయాల్సి వస్తుందేమోనన్న అనుమానం కలిగింది.

గుడిసె మధ్య కూర్చుని ఆలోచనలు చేస్తూ వున్నాను. కాపలా కాస్తున్న వాళ్ళల్లో ఒకతను వంగి ద్వారంగుండా నాకేసి చూశాడు. నేను కూర్చొనుండటం గమనించి పెద్దగా కేక పెట్టాడు. రెండో అతనుగూడా వచ్చాడు. నా రెక్క పట్టుకుని వెలుపలకు గుంజుకుపోయారు. అలానే నడిపించుకు పోయారు నాయకుడి మకాం ముందుకు.

నాయకుడు ముంతెత్తి ఏదో త్రాగుతున్నాడు. అతని ముందు నల్లటిరాళ్ళు ముందు పెట్టుకొని, వాటిపైన పొడవు పాటి కత్తులకు పదును పెడుతున్నారు పదిమంది.

నా వెంట వచ్చిన వాళ్ళకు నాయకుదేదో చెప్పాడు. వాళ్ళు ఒక నల్లరాయి తెచ్చి నాముందు పెట్టి ఒక వంద కత్తులు గుట్టగాపోసి, ప్రక్కనే కొంతమంది ఆఫ్రికన్లు చేస్తున్న విధంగా చెయ్యమన్నారు.

నేను వంగి రాతిముందు కూర్చుని పని మొదలు పెట్టాను.

ఒక్కొక్క కత్తి పదును పెట్టేందుకు అరగంట పైనే పట్టసాగింది నాకు. రెండు కత్తులు పదును పెట్టాను. నాయకుడు లేచి వచ్చాడు నా ముందుకు. నేను పదును పెట్టిన కత్తినొకదాన్ని తీసుకుని ప్రక్కనేవున్న లావు పాటి కొయ్యదుంగను రెండు చేతుల్తో బలంగా పైకెత్తి మోదాడు. అది రంపంతో కోసినట్లు రెండుగా తెగి పోయింది.

నన్ను చూసి సంతోషంగా నవ్వాడు. కత్తితెచ్చి నా ముందు పడేసి భుజంమీద తట్టాడు.

అతను దగ్గరగా వున్నప్పుడు గుప్పున వాసన కొట్టింది. అది నాకు బాగా పరిచితమైన వాసన. విస్కీ వాసన. అతనికి విస్కీ ఎలా వచ్చిందో నాకు అర్థంకాలేదు.

విస్కీలాంటిదేదైనా ఈ ప్రాంతాల్లో దొరుకుతుందేమో ననుకున్నాను. నాయకుడి ఖాళీ ముంతతో లోనికి వెళ్ళాడు. నేను కత్తికి పదును పెడుతూనే వున్నాను. అతను ముంతలో ఏదో పోసుకుని వెలుపలికి వచ్చి రాతి మీద కూర్చున్నాడు. త్రాగడం మొదలెట్టాడు.

నేను రాయికేసి కత్తిని రుద్దుతున్నాను తప్ప మన స్సంతా ఆ నాయకుడి చేతులోవున్న ముంతమీదే వుంది.

అదేమైనా నాకు శాస్త్ర ఇస్తే బాగుండుననిపించింది. నా కళ్ళలోకి అతను నాలుగైదుసార్లు ప్రశ్నార్థకంగా చూశాడు.

దాహంగా వుందని చెప్పాలనిపించినా కోరిక చంపుకుని పనిలో నిమగ్నమయినాను.

మరో పదిమంది మా వెనక వేపు కూర్చుని దివిటీల్లాంటివి తయారు చేస్తున్నారు. ఒక పెద్ద మట్టితొట్టిలో వాట్ని ముంచి నేలలో గుచ్చి పెడుతున్నారు ఎందేందుకు. ఆ తొట్టిలో వున్నది పందికొవ్వు అయివుండాలనుకున్నాను.

ఈ కత్తులు పదును పెట్టడం, దివిటీలు తయారు చెయ్యడం ఎందుకో, నాకు అర్థంకాలేదు.

పగలంతా వాళ్ళు ఏదేవో సర్దుకుంటూ, హడావుడిగా అటూ ఇటూ తిరుగుతూ వుండటం గమనించాను.

మునిమాపు చీకటి పడింది.

నన్ను బంధించిన గుడిసెముందే అంతా పోగయ్యారు.

రెండు పెద్ద పందుల్లాంటి మృగాల్ని చంపి తెచ్చారు లాగుంది.

వాటిచెట్టంత ఎత్తు లేచే మంటలు పెట్టారు. ఆ మృగాలను పడేశారు అందులో. అరగంట దాకా కాలనిచ్చారు. మధ్యమధ్య పొడవుపాటి ఇనుప కమ్మితో అన్నిప్రక్కలా కాలేందుకు వీలుగా వాటిని అటూ ఇటూ త్రిప్పుతూండటం గమనించాను. బాగా కాలాక వాటిని వెలుపలకు లాగారు.

ఆ దీవిలో వున్న మొత్తం ఆటవికులు ఆ మంటచుట్టూ పెద్దగా అరుస్తూ, ఎగురుతూ తిరగసాగారు. వాళ్ళ నాయకుడు మాత్రం ఎత్తైన ఆసనంపైన కూర్చున్నాడు. నలుగురైదుగురు కొంచెం దూరంగా నిలబడి తప్పెట్లు

వాయించసాగారు. వాటి శబ్దాని కనుగుణంగా ఎగరసాగారు వాళ్ళు.

కళ్ళముందు కనిపిస్తున్న కోలాహలం ఏమిటో, ఎందుకో, దాని అవసరం ఉన్నట్టుండి ఎందుకు వచ్చిందో నాకు అర్థంగాలేదు. డిల్లాజాడ అంతదాకా అంతులేకుండా పోయింది. ఆమె ఎలావుందో నన్న ఆందోళనతో నా మనస్సు వికావికాలై పోయింది.

ఎవరినన్నా వాకబు చేద్దామనుకున్నాను. వాళ్ళ భాష నాకు రాకపోవడం, నా భాష వాళ్ళకు తెలీకపోవడం గుర్తొచ్చి ఆ ప్రయత్నం విరమించుకున్నాను. మెల్లగా కోలాహలం సద్దు మణిగింది.

అందరూ మంటచుట్టూ కూర్చుని కాలిన మాంసం పీక్కు తింటూ, ఏదో పానీయం మధ్యమధ్య త్రాగుతూ, ఒకర్నొకరు మోచేతులతో పొడుకుంటూండటం గమనించాను.

ఒకతను కొద్దిగా మాంసం, కొంత పానీయం తెచ్చి నా ముందుంచాడు. తినమని సైగ జేశాడు.

అతన్ని చేతులు త్రిప్పుతూ సైగలుజేస్తూ, డిల్లాగురించి అడిగాను. అతనేదో తమాషాగా కళ్ళు త్రిప్పుతూ చెప్పాడు. నాకర్థం కాలేదు. నా ముందు పెట్టిన మాంసం తినేందుకు ప్రారంభించేను. ఒక్క ముక్క పీకి నోట్లో పెట్టుకున్నాను.

అది ఏ జంతువు మాంసమో అర్థంగాలేదు గానీ చాలా రుచిగా వుంది. ఆకలితో వున్నందువల్ల గబగబ తినేశాను. అతను ఇచ్చిపోయిన పానీయం త్రాగాను. ఒక్కొక్క చుక్కే లోనికి దిగుతుంటే ఒళ్ళంతా మత్తులో మునిగిపోసాగింది. కళ్ళపైకి నిద్రలాంటిదేదో మగతగా క్రమ్ముకొచ్చింది. ఎదురుగా వున్న వస్తువులన్నీ మసకగా కను

పించ సాగాయి. కొంత సేపటికి కళ్ళు నా ఇష్టాఇష్టాలతో ప్రమేయం లేకుండా మూసుకుపోయాయి. ఆ తర్వాత ఏమయిందీ నాకు తెలియదు.

మళ్ళీ కళ్ళు తెరచేసరికి, గుడి స మూలగా వెలుగుతున్న దివిటీ కనుపించింది. లేచి కూర్చున్నాను. వెలుపల ఏ విధమైన అలికిడి లేదు. ఆటవికుల గుంపు ఎటో పోయినట్లుంది. రక్కున లేచి కూర్చున్నాను. డిల్లాను వెళ్ళి వెతికేందుకు మంచి అవకాశం దొరికిందిగదాని సంతోషించాను. లేచి నిలుచున్నాను. కాళ్లూ, చేతులూ విదిలించుకుని, గుమ్మం లోంచి వెలుపలికి వెళ్దామని వంగి తల బైట పెట్టాను.

తలపైన రప్‌మని కొయ్యాదుంగతో ఎవరో కొట్టినట్లు దెబ్బ పడింది. దిమ్మతిరిగి పోయింది. తల రక్కున లోపలకు లాక్కుని కూర్చుని వెలుపలకు చూశాను. ఎవ్వరు కనుపించలేదు. చేతో తల తడుముకున్నాను. దెబ్బ తగిలిన చోట నొప్పిగానే వుంది. అరచేత్తో గట్టిగా రాసుకున్నాను.

కళ్ళు తెరిచి చూచేందుకు ప్రయత్నించాను. ఎదురుగా అంతా బూజరగా కనుపించింది. తల అటూ ఇటూ విదలించి దృష్టి సరిచేసుకుని చూశాను. అంతకుముందుదాకా మండి బూడిద క్రమ్మిన నిప్పుగుండం తప్ప మరేం కనుపించ లేదు. నా తలపైన కొట్టింది వరయి వుంటారని ఆలోచిస్తూ తల కాస్త ముందుకు పెట్టి వెలుపలకు పరిశీలించి పరీక్షగా చూశాను. ఎవ్వరూ కనుపించ లేదు.

నాకు అనుమానం వేసింది. వెలుపలకిపోబోతూ పూర్తిగా వంగనందువల్ల చిన్న గుమ్మం పైవేపునున్న కొయ్యతగిలి వుంటుందేమోననుకున్నాను. తలెత్తి ఆ కొయ్యకేసి చూశాను. అది సన్నటి వెదురుబొంగు మాత్రమే. కానీ నా తలకు తగిలింది లావుపాటి బడితె

లాంటిది. అందులో సందేహం లేదు.

మరోమారు ప్రయత్నంచేద్దామని తీర్మానించుకున్నాను. పైకి చూస్తూ వొంగి గుమ్మం వెలుపల బెట్టి కాళ్ళుజాపి చేతుల్తో నేలను అదిమి పట్టుకున్నాను. ఒక్క ఊపుతో వెలుపలకు గెంతాను. అంతే రపీరపీమని వీపుపైన, భుజాల పైన, తలపైన బడిత దెబ్బలు సమ్మెటపోటుల్లా పడ్డాయి. వికృతమైన అరుపులేవో చెవులు దద్దరిల్లజేస్తూ వినిపించ సాగాయి.

ఆ దెబ్బల తాకిడికి ఓర్చుకోలేకపోయాను. అదేదో అదృశ్యశక్తి నా కాళ్ళకూ, త్రోవకు అడ్డంగా వున్నట్లు తోచి వెనక్కి పరుగెత్తాను గుడిసెలోకి. దెబ్బలు ఆగాయి. కానీ ఎముకల్లో సలుపు పుట్టుకొచ్చింది.

ఆటవికుల నాయకుడి దగ్గరున్న పెద్ద ఎముక, దాని సహాయంతో అతను చేసిన వింతలు గుర్తొచ్చాయి. నాకు కాపలాగ బహుశా వాళ్ళేదో దయ్యాన్ని నిలబెట్టిపోయి వుంటారని అనుమానం కలిగింది. దాని బారినుండి తప్పించుకు పోయే మార్గం కోసం ఆలోచిస్తూ కూర్చున్నాను.

డెల్లాను కూడా అలాగే బంధించి వుంచారేమోననుకున్నాను. అందువల్లే ఆమె నన్ను అంతదాకా కలుసుకొనే ప్రయత్నమేమీ చెయ్యలేదనిపించింది. ఆమె క్షేమంగా వుందన్న విషయం తెలుసుకొంటే తప్ప నాకు మనస్థైర్యం కలిగేట్టులేదు. వీళ్ళ ఆడవాళ్ళంతా ఎక్కడున్నారో, ఏంచేస్తుంటారో, అలా దూరంగా వుంచటం ఎందుకో తెలీక, ఏంచెయ్యాలో తోచక, గుమ్మంముందు కూర్చుని, ఎదురుగావున్న చిక్కటి చీకటికేసి చూడసాగాను.

దెయ్యాలకు నిప్పంటే భయమని చిన్నప్పుడు ఎవరో చెప్పగా విన్నమాటలు గుర్తొచ్చాయి. అది నిజమే అయినా నా దగ్గర కనీసం అగ్గిపెట్టికూడా లేదు. ఒక్క దివిటీ

సంపాదిస్తే, దయ్యం దానికి భయపడుతుందో లేదో పరీక్షించి చూడవచ్చు. కానీ ఆ అవకాశంకూడా లేదు.

బూడిద పేరుకున్న అగ్నిగుండం నాకు ఇరవైగజాల దూరంలో వుంది. దాన్లోంచి ఒక కాలిన కర్రముక్క సంపాదిస్తే బాగుండుననిపించింది. కానీ దానిదగ్గరకు పోయే మార్గంలేదు. కాలు వెలుపల పెడితే తల బొప్పి కట్టేట్లు బాదుతుంది దయ్యం.

దయ్యాలు నిద్రపోతాయో, లేదో నాకు తెలీదు. అలాంటి నిద్రపోవటమనే అవస్థయినా దయ్యానికుంటే, నన్ను కాపలా కాచే దెయ్యాన్ని బురిడీ కొట్టించగలను. కళ్ళల్లో ఒత్తులు పెట్టుకునయినా వేకువఝాముదాకా మేలుకొని వుండి, మరో ప్రయత్నం చేద్దామనుకున్నాను.

అంతగా అప్పటికీ దయ్యం మేలుకొనే వుంటే దాని చేత తన్నులు తింటూనే అగ్నిగుండంవేపు పరుగెత్తి, ఎలాగైనా కాలే కర్రముక్కను సంపాదించి, ఆ తర్వాత దెయ్యమెలా రియాక్టు చేస్తుందో చూద్దామని నిర్ణయించుకున్నాను. ఆ తర్వాత కాలాన్ని ముందుకు జరపడం తప్ప నేనుచేసింది మరేంలేదు.

వెళ్ళిపోయిన ఆటవికులెవ్వరూ వస్తున్న జాడ కనుపించలేదు. దూరంగా మరేదైనా గూడెంలో ఆడవాళ్ళంతా వుండి వుంటే, రాత్రివేళ తమ తమ భార్యల్తో హాయిగా గడిపేందుకు వీళ్ళంతా వెళ్ళివుంటారా అన్న అనుమానం కలిగింది. కానీ దివిటీలు వెలిగించుకుని, కత్తులు నూరుకుని, వెళ్ళటం చూశాను కాబట్టి, గుంపంతా మరేదో ముఖ్యమైన పనిమీద వెళ్ళివుండాలనిపించింది.

తెల్లవారేందు కింకో గంట టైముంటుందనుకున్నాను ఆకాశంలో కనిపిస్తున్న నక్షత్రాలను చూసి. నేననుకున్న విధంగా ప్రయత్నం చేద్దామన్న ఉద్దేశ్యంతో సర్దుకుని

కూర్చుంటున్నాను.

"జాన్! జాన్!!" అంటూ పెద్దగా కేక వినిపించింది. అది డెల్లా గొంతే. ఆ దీవిలో, నా పేరు పిలువగలిగింది డెల్లాతప్ప మరెవ్వరూ లేరు. ఆ పిలుపు ఏ దయ్యందీ కావటానికి వీలులేదు.

"డెల్లా! డెల్లా!!" బదులు పిలిచాను.

"ఎక్కడున్నావ్?"

"ఇక్కడే! గుడిసెలో వున్నాను. నువ్వు ఆ మంట లోంచి ఒక కాలుతున్న కట్టె తీసుకొనిరా! నాకు కాపలాగా పెద్ద దయ్యంవుంది. దాని చేతిలో ఏదో లావుపాటి బడితవుంది" అరచాను. చీకట్లోకి కళ్ళు చిట్లించి చూశాను. దూరంగా అగ్నిగుండానికి అవతలవైపు కనుపించింది డెల్లా.

కాలుతున్న కట్టెకోసం, మంటల్ను కలయబెట్టింది డెల్లా. ఎర్రగా నిప్పు వెలుతురులో చూశాను డెల్లాను. కట్టె తీసుకుని నన్ను బంధించి ఉంచిన చిన్న గుడిసెవేపు వచ్చింది.

ఆమె అడుగు ముందుకు వేసేకొద్దీ నాకు భయంగావుండి పోయింది. దయ్యం నిప్పుకు భయపడుతుందని విన్నాను తప్ప ఎప్పుడూ పరీక్షించి ఉండకపోవటంతో, నా ముందున్న దయ్యం డెల్లాకుకూడా బడితపూజ చేస్తుందేమో నన్న అనుమానం కలిగి, రెప్ప ఆర్పకుండా చూడసాగాను.

డెల్లా ఒక్కొక్క అడుగే ముందుకు వేసుకుంటూ, చుట్టూ పరీక్షగా చూసుకుంటూ రాసాగింది నావైపు.

నేనున్న గుడిసె గుమ్మానికీ ఆమెకూ ఉన్న మధ్య దూరం తగ్గిపోసాగింది. మూడడుగుల్లో వుంది డెల్లా. దయ్యం ఎందుకు ఆమెపైకి పోవడంలేదో అర్థమయింది. నేను విన్నది నిజమేనన్న విషయం రుజువయ్యాక నా విజ్ఞానానికీ సమయస్ఫూర్తికీ, నాకే గర్వం కలిగింది.

డేల్లా ఏ విధమైన అపాయం, ప్రమాదం లేకుండా దర్యాన్ని దాటుకొని గుడిసెలోకొచ్చేసింది కాలుతున్న కట్టెసాయంతో.

"జాన్! నిన్ను మళ్ళీ చూస్తాననుకోలేదు!" నా గుండెల పైకి వొరిగిపోయింది డెప్రూ.

"ఏం జరిగింది? నువ్వెక్కడున్నావ్ ఇంతదాకా?"

"ఇక్కడికి రెండు మైళ్ళ దూరంలో మరో చిన్న గూడెం వుంది. అక్కడంతా కలిసి ఇరవైమంది ఆడవాళ్లు పదిమంది పసిపిల్లలూ ఉన్నారు. నన్నుకూడా వాళ్ళకు అప్పగించారు. వాళ్ళ ఆకారాలు వికృతంగా ఉన్నాయి. రాక్షసుల్లా ఉన్నారు. పిల్లలుకూడా అంతే. ఇక్కడికి లాగే అక్కడ చిన్నచిన్న గుడిసెలున్నాయి. మగాళ్ళు ఎవ్వరూలేరు. పసిపిల్లలుకూడా అంతా ఆడవాళ్ళే" చెప్పటం మొదలెట్టింది డేల్లా నా ప్రక్కనే కూర్చుని.

"ఇంతకూ ఏమైనా తిన్నావా? లేదా?" అడిగాను గుచ్చి.

"తిన్నాను. అదేదో వండిన మాంసం పెట్టారు. త్రాగేందుకేదో పానీయం ఇచ్చారు. మనం త్రాగేవిస్కీ, బ్రాందీలకన్నా, విపరీతమైన మత్తువుంది అందులో."

"నిన్నేమైనా అన్నారా?"

"నన్ను చూడగానే ఏమేమో అరచారు. ఎగిరారు. అంగాంగాలు పరిశీలించి చూశారు. వాళ్ళ ఆకారాల ముందు నేనో చిన్న పిట్టలాగున్నట్లుంది. నన్నో గుడిసెలో పెట్టారు. కాపలాగా ఇద్దరు పిల్లల్ని పెట్టారు. వాళ్ళు దేనికీ నన్ను వెలుపలకు పోనీయలేదు. అన్నీ ఆ లోపలే చూసుకోవాలి. నీ గురించి అడిగాను. మనభాష తెలీక పోవటంతో నా ప్రశ్నకు వాళ్ళు జవాబు చెప్పలేక పోయారు."

—(సశేషం)